
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

సోమవారం 19 ఫిబ్రవరి 2024



నేడు నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



ఎం.విజయసునీత

పాడేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన ఎం.విజయసునీత సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన సుమిత్‌కుమార్‌ను పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ చేసి, ఆయన స్థానంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎం.విజయసునీతను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సోమవారం ఆమె పాడేరు చేరుకుని సుమిత్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేశ్

జాబ్ కేపిటల్‌గా విశాఖ

ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారుస్తాం



మాట్లాడుతున్న నారా లోకేశ్



విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం రైతు బజార్ ఎదురుగా నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ శ్రేణులు

- పెద్దసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తాం
- స్వర్ణకారుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు
- మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి కృషి
- టీడీపీ, జనసేన కార్యకర్తల నడుమ చిచ్చుకు కుట్ర
- అప్రమత్తంగా ఉండాలి
- 'హలో ఏపీ, బైబై వైసీపీ' అందరి నినాదం కావాలి
- శంఖారావం సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

'విశాఖ నగరాన్ని హైదరాబాద్ కంటే రెట్టింపు అభివృద్ధి చేస్తాం. ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా చేసి, పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం'...అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఆదివారం దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ విశాఖను మళ్లీ జాబ్ క్యాపిటల్ ఆఫ్ ఏపీగా తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు.

మత్స్యకారులు, స్వర్ణకారుల సమస్యలపై దృష్టి..

అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులు, స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. స్వర్ణకారులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని, వారికి ఆర్థికంగా సహకారాన్ని అందిస్తామన్నారు. మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలు అందించడమే కాకుండా వలలు, ఇతర వస్తువులను అందిస్తామన్నారు. విశాఖపట్నం ... మిగతా 7వ పేజీలో

ఐరన్ లెగ్ జగన్

- విశాఖ పరిపాలనా రాజధాని అన్నాడు...
- 30 ఏళ్ల నుంచి ఉన్న ఎల్‌జీ పాలిమర్స్ పేలింది
- ఆయన్ను నగరానికి ఎంత దూరంలో ఉంచితే అంత మంచిది
- విశాఖలో టీడీఆర్‌ల పేరుతో రూ.వేల కోట్లు మింగిన వైసీపీ నేతలు
- దసపల్లా భూములూ కొట్టేశారు
- అధికారంలోకి వచ్చిన తరువాత వడ్డీతో సహా కక్కిస్తాం
- ఏయూ వీసీ అక్రమాలపై విచారణ చేపట్టి జైలులో పెట్టిస్తాం
- ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులు ఓటుకు రూ.10 వేలు ఇస్తారు
- అవి తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటు వేయండి
- 'పశ్చిమ' సభలో నారా లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి జగన్ ఐరన్ లెగ్. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తానంటూ ఇక్కడ అడుగుపెట్టాడు. 30 ఏళ్లగా ఉన్న ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమ పేలిపోయింది. ఏడాదికో పరిశ్రమలో బాయిలర్లు పేలుతున్నాయి'...అంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఆదివారం రాత్రి పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపాన నిర్వహించిన ... మిగతా 7వ పేజీలో

లంబసింగి ఘాట్‌లో అదుపుతప్పిన ట్రాలీ లారీ

రక్షణ గోడపైకి దూసుకుపోయిన ఇంజన్ క్యాబిన్

- రహదారికి అడ్డంగా నిలిచిపోయిన ట్రాలీ
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- క్రేన్ సాయంతో ట్రాలీ తొలగింపు
- పది గంటల తరువాత ట్రాఫిక్ పునరుద్ధరణ



రక్షణ గోడపైకి దూసుకుపోయిన ట్రాలీ

చింతపల్లి, ఫిబ్రవరి 18:

మండలంలోని లంబసింగి ఘాట్‌రోడ్డులో భారీ ట్రాలీ అదుపుతప్పి రక్షణగోడపైకి దూసుకుపోయింది. ట్రాలీ వెనుక భాగం రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో నర్సీపట్నం-చింతపల్లి మార్గంలో బస్సులు, వ్యాన్‌లు, లారీలు, ఇతర భారీ వాహనాల రాకపోకలు స్తంభించాయి. వివరాల్లోకి వెళితే...





ఘాట్ రోడ్డులో ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు

జాతీయ రహదారి నిర్మాణ పనులకు అవసరమైన యంత్రాలను మైదాన ప్రాంతం నుంచి ఒక ట్రాలీలో చింతపల్లి తీసుకువచ్చారు. వీటిని దించిన తరువాత ఖాళీ ట్రాలీ ఆదివారం ఉదయం చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళుతున్నది. దారిలో లంబసింగి ఘాట్ బోడకొండమ్మ దేవాలయానికి కిలోమీటరు ముందు ట్రాలీ అదుపుతప్పి రక్షణగోడపైకి దూసుకుపోయింది. ఇంజన్ క్యాబిన్ రక్షణగోడపై నిలిచిపోగా, ట్రాలీ వెనుక భాగం రహదారికి అడ్డంగా వుండిపోయింది. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు మాత్రమే వెళ్లడానికి వీలుంది. దీంతో ఇరువైలా ఆర్టీసీ బస్సులు, వ్యాన్లు, లారీలు, ఇతర భారీ వాహనాలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు ఆటోలు, జీపుల్లో గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు. కాగా ట్రాలీ యజమానులు సాయంత్రం ఒక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చారు. కానీ ట్రాలీని బయటకు తీసే ప్రయత్నాలు ఫలించలేదు. తరువాత నర్సీపట్నం నుంచి క్రేన్‌ను రప్పించారు. రాత్రి 8.30 గంటలకు ట్రాలీని తీయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 10 గంటల తరువాత అన్ని రకాల వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. వ్యాన్లు, లారీల డ్రైవర్లు, క్లీనర్లు తాగునీరు, భోజనం కోసం ఇబ్బంది పడ్డారు.

విశాఖకు జన సేనాని



- కొణతాల నివాసానికి వెళ్లి భేటి
- అనంతరం హోటల్‌లో సమన్వయకర్తలతో సమావేశం
- నేడు పూర్తిస్థాయి సమీక్ష



హోటల్‌లో సమన్వయకర్తలు, నాయకులతో సమావేశమైన పవన్ కల్యాణ్

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదివారం రాత్రి విశాఖపట్నం విచ్చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.30 గంటలకు నగరానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన విమానాశ్రయం నుంచి నేరుగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కొద్దిసేపు పవన్‌కళ్యాణ్ సమావేశం అయ్యారు. సోమవారం పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చించి దిశానిర్దేశం చేయనున్నారు.

-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

స్వల్పంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

- జి.మాడుగులలో 11.2 డిగ్రీలు నమోదు
- తగ్గని చలి, మంచు ప్రభావం



లంబసింగిలో కురుస్తున్న మంచు

పాడేరు/ చింతపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. చలి, పొగమంచు ప్రభావం కొనసాతున్నది. ఆదివారం జి.మాడుగులలో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పాడేరులో 12, పెదబయలులో 12.5, హుకుంపేటలో 12.8, ముంచంగిపుట్టులో 13, జీకేవీధిలో 13.9, చింతపల్లిలో 14.5 డిగ్రీలు నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురిసింది. జిల్లా కేంద్రంలో పొగమంచు ప్రభావం కనిపించలేదు. చలి తీవ్రత యథావిధిగానే వుంది.

కొత్తపల్లి జలపాతం వద్ద అరకొరగా వున్న పర్యాటకులు



పర్యాటక ప్రదేశాల్లో తగ్గిన సందడి

- కొత్తపల్లి జలపాతం, అరకులోయ ప్రాంతాలకు అరకొరగా సందర్శకులు
- మారిన వాతావరణం, సమీపిస్తున్న పబ్లిక్ పరీక్షలే కారణం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని సందర్శనీయ ప్రాంతాల్లో ఆదివారం పర్యాటకుల సందడి కొంతమేర తగ్గింది. వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ఏజెన్సీలో పొగమంచు ప్రభావం తగ్గింది. దీనికితోడు సంవత్సరాంత పరీక్షలు సమీపిస్తుండడంతో పర్యాటకులు అంతంతమాత్రంగానే వచ్చారు.



చెరువులవేనం వద్ద పర్యాటకులు

అనంతగిరి మండలం బొర్రా గుహలు, కటిక, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, డుంబ్రిగుడ మండలం చాపరాయిగెడ్డ, పాడేరు మండలం వంజంగి హిల్స్‌కు మోస్తరుగా పర్యాటకులు వచ్చారు.

లంబసింగికి మెరుగ్గా పర్యాటకులు

చింతపల్లి, ఫిబ్రవరి 18: ఏజెన్సీలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే లంబసింగికి పర్యాటకులు ఒకింత బాగానే వచ్చారు. పర్యాటక సీజన్ ముగుస్తుండడంతో ప్రకృతి అందాలను వీక్షించేందుకు పలు రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. లంబసింగి, చెరువులవేనం వ్యూపాయింట్, తాజంగి జలాశయం వద్ద సందడి వాతావరణం నెలకొంది.

తాగునీటి పథకం.. అలంకారప్రాయం!



- శ్రీకృష్ణపురంలో దాహం కేకలు
- కలుషిత ఊట నీటితో రోగాల భయం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

- 8లో

చురుగ్గా హైవే పనులు



డుంబ్రిగుడ-గొందివలస మధ్య అందుబాటులోకి వచ్చిన జాతీయ రహదారి



డుంబ్రిగుడ మండలంం చాపరాయి సమీపంలో గెడ్డపై పూర్తయిన వంతెన నిర్మాణం

ఐదో ప్యాకేజీ కింద డుంబ్రిగుడ మండలం గొందివలస- అరకులోయ మండలం కొత్తభల్లుగుడ మధ్య జాతీయ రహదారి నిర్మాణం

- 24 కి.మీ.లకుగాను అందుబాటులోకి 18 కి.మీ.ల తారు రోడ్డు
- శరవేగంగా సాగుతున్న వంతెనలు, అప్రోచ్ రోడ్ల పనులు
- ఆరు నెలల్లో పూర్తవుతాయని నిర్మాణ కంపెనీ వెల్లడి

అరకులోయ, ఫిబ్రవరి 18:

రాజమహేంద్రవరం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా విజయనగరం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి (516-ఈ) ఐదో ప్యాకేజీ పనులు అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో చురుగ్గా సాగుతున్నాయి. మొత్తం 24 కిలోమీటర్లకుగాను ఇప్పటికే 18 కిలోమీటర్ల మేర తారు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. గెడ్డలపై వంతెనలు, రైల్వే ట్రాక్‌పై రెండుచోట్ల ఫ్లైఓవర్ వంతెనలు, బైపాస్ జంక్షన్ల వద్ద పనులు కొనసాగుతున్నాయి. మరో ఆరు నెలల్లో ఈ పనులన్నీ పూర్తవుతాయని రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ కంపెనీ ప్రాజెక్టు ఇన్‌చార్జి రమణయ్య తెలిపారు.



అరకు-యండపల్లివలస మధ్య రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణంలో భాగంగా పిల్లర్లపై భారీ క్రేన్లతో గడ్డర్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం, కృష్ణాదేవిపేట, చింతపల్లి, పాడేరు, అరకులోయ, బొడ్డవర మీదుగా విజయనగరం వరకు 516-ఈ నంబర్‌తో జాతీయ రహదారి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం-రంపచోడవరం ప్యాకేజీ-1, రంపచోడవరం-కృష్ణాదేవిపేట ప్యాకేజీ-2, కృష్ణాదేవిపేట-పాడేరు ప్యాకేజీ-3, పాడేరు-గొందివలస ప్యాకేజీ-4, గొందివలస-కొత్తభల్లుగుడ ప్యాకేజీ-5, అనంతగిరి మండలం చిలకలగెడ్డ నుంచి విజయనగరం వరకు ప్యాకేజీ-6గా విభజించి పనులు చేపడుతున్నారు. అరకులోయ మండలం కొత్తభల్లుగుడ నుంచి అనంతగిరి మండలం చిలకలగెడ్డ వరకు ఘాట్ రోడ్డు, రిజర్వు ఫారెస్టు పరిధిలో వుండడంతో ఇంకా పనులు మొదలుపెట్టలేదు. డీపీఆర్ మాత్రం తయారైంది.

జాతీయ రహదారి 5వ ప్యాకేజీ కింద డుంబ్రిగుడ మండలం గొందివలస నుంచి అరకులోయ మీదుగా కొత్తభల్లుగుడ వరకు 24 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం జరుగుతున్నది. రూ.192 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇంతవరకు 75 శాతం మేర పూర్తయ్యాయి. వాస్తవంగా ఇప్పటికే రహదారి నిర్మాణం పూర్తికావాల్సి వుంది. అయితే రహదారి నిర్మాణానికి పలుచోట్ల భూసేకరణకు రెవెన్యూ పరంగా కొంత ఆలస్యం ... మిగతా 8వ పేజీలో





తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన అశేష జనవాహిని, అభిమానులు బహూకరించిన కత్తి డాలుతో లోకేశ్

లోకేశ్‌కు జన హారతి

శంఖారావం సభలు సూపర్ సక్సెస్

తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లోని సమావేశాలకు భారీగా హాజరైన ప్రజలు

తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పేరట ఆదివారం తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలకు జనం పోటెత్తారు. పార్టీ శ్రేణులతో పాటు పార్టీ అభిమానులు, నగర వాసులు వెల్లువలా తరలివచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ- జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేస్తే నగరాన్ని అభివృద్ధి పథంలో ఎలా పయనింపజేసేదీ లోకేశ్ వివరించారు. గత ఐదేళ్లుగా కబ్జాలకు నిలయంగా మారిన విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటానని, ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



సింహాచలంలో భక్తులతో కలిసి ఫొటో దిగుతున్న యువనేత లోకేశ్



లోకేశ్‌కు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, ఇతర నేతలు



ఇందిరా మునిసిపల్ స్టేడియంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు



లోకేశ్‌కు వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందిస్తున్న దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న లోకేశ్





లోకేశ్‌ను చూసిన ఆనందంలో మహిళా కార్యకర్తలు, యువతి



లోకేశ్ రాకకోసం ఎదురుచూస్తున్న తూర్పు నియోజకవర్గ మహిళలు



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా



తూర్పు నియోజకవర్గ సభలో టీడీపీ ఆరు గ్యారెంటీల కరపత్రాలను ప్రదర్శిస్తున్న ముస్లిం మహిళలు







తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీలతో నారా లోకేశ్ మాటామంతీ

తారకరత్నకు లోకేశ్ ఘన నివాళి



తారకరత్న చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న లోకేశ్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 18: నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా విశాఖ నగరంలో ఆదివారం ఆయనకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఘన నివాళి అర్పించారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన శంఖారావం సభా వేదిక వద్ద ఏర్పాటుచేసిన తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

క్రైం... crime news

బయ్యవరం వద్ద వ్యక్తి అనుమానాస్పద మృతి

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం గ్రామ సమీపంలో కొత్తపల్లి బుచ్చెయ్యపేటకు వెళ్లే రహదారిలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని సీఐ వినోద్‌బాబు తెలిపారు. మృతుడు అసోం రాష్ట్రం ఉదల్‌గురి జిల్లా మంజిత్ మండలానికి చెందిన మంగల్ గ్వాలా(32)గా గుర్తించామన్నారు. బయ్యవరం వద్ద మృతదేహం ఉన్న విషయాన్ని స్థానికులు గుర్తించి వీఆర్‌వోకి సమాచారం ఇచ్చారని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు. మంగల్‌గ్వాలా మృతికి గల కారణాలపై విచారణ చేపడుతున్నామని సీఐ చెప్పారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

కోటవురట్ల, ఫిబ్రవరి 18: మండలంలోని కొత్తూరు రోడ్డు మలుపు వద్ద బైక్ అదుపు తప్పిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని నీలిగుంట గ్రామానికి చెందిన కరెడ్ల లోవరాజు (41) కుమార్తె కోటవురట్ల కస్తూర్బా విద్యాలయంలో చదువుకుంటుంది. ఆదివారం కుమార్తెను చూడడానికి లోవరాజు భార్య లక్ష్మి వెళ్లింది. భార్యను తిరిగి ఇంటికి తీసుకు రావడానికి లోవరాజు బైక్ వెళుతుండగా కొత్తూరు రోడ్డు మలుపు వద్ద వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది.ఈ ప్రమాదంలో లోవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కోటవురట్ల ఎస్ఐ రమణయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృత్యుడు లోవరాజుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పశువధశాలపై పోలీసుల దాడి

- ముగ్గురు అరెస్టు, మరో ఇద్దరు పరారీ
- 1,660 కేజీల పశుమాంసం, 9 పశువులు స్వాధీనం



పట్టుకున్న పశుమాంసాన్ని పూడ్చిపెట్టేందుకు తీసిన గొయ్యిని పరిశీలిస్తున్న పోలీసులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 18: స్థానిక పీటీడీ బస్టాండును ఆనుకుని రైల్వే పట్టాలకు సమీపంలో నిర్వహిస్తున్న పశుకబేలాపై ఆదివారం తెల్లవారుజామున పాయకరావుపేట పోలీసులు దాడి చేశారు. యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ చైర్మన్ గోపాల్ సమాచారం ఇవ్వడంతో ఆదివారం తెల్లవారుజామున పట్టణంలో పశువులను కబేలాపై పోలీసులు దాడిచేశారు. ఆ సమయంలో పశువుల మాంసం వేరు చేస్తుండడాన్ని గుర్తించి, వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, మరో ఇద్దరు పారిపోయారు. దాడి సమయంలో షెడ్డులో ఉన్న సుమారు 1,660 కేజీల పశు మాంసాన్ని, సమీపంలో చెట్లకు కట్టి ఉన్న తొమ్మిది పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ జోగారావు మాట్లాడుతూ పట్టుబడిన మాంసాన్ని మధ్యవర్తుల సమక్షంలో పట్టణ శివారులో పాతిపెట్టామని, బతికి ఉన్న పశువులను పశువుల సంరక్షణ శాలకు తరలించామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, అదుపులోకి తీసుకున్న నిందితులను రిమాండ్‌కి తరలించామని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న నాగబాబు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఆదివారం అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతాన్ని పలికారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నాగబాబుకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, నాయకులు దాడి రత్నాకర్, దాడి జయవీర్, మళ్ల సురేంద్ర, జనసేన నాయకులు సుందరపు విజయ్‌కుమార్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి, పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం వేల్పులవీధిలో గల గౌరీ పరమేశ్వరుల ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



నాగబాబుకు నూకాంబిక చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మునగపాక, ఫిబ్రవరి 18 : మండలంలోని నాగులాపల్లిలో నారా లోకేశ్ యువగళం రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకూ జరిగే ఈ పోటీలకు కర్నూలు, అల్లూరి, అనంతపురం, అనకాపల్లి, తూర్పు గోదావరి, గుంటూరు, కడప, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి మహిళా జట్లు, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల నుంచి పురుషుల జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకూ పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా ఆదివారం జరిగిన పోటీలలో ముందుగా మహిళల టీమ్ నుంచి అల్లూరి, కర్నూలు జిల్లాలు పోటీ పడ్డాయి. కర్నూలు టీమ్‌పై అల్లూరి జిల్లా గెలుపొందింది. అలాగే అనకాపల్లిపై అనంతపురం, గుంటూరుపై తూర్పు గోదావరి విజయం సాధించగా, కడపపై విశాఖజట్టు విజయం సాధించింది. అలాగే అనకాపల్లిపై విజయనగరం టీమ్ విజయం సాధించింది. అలాగే కర్నూలుపై శ్రీకాకుళం టీమ్ గెలుపొందింది. అలాగే అల్లూరి టీమ్‌పై విశాఖ, అనంతపురంపై తూర్పు గోదావరి జట్లు గెలుపొందాయి. అలాగే పురుషుల టీములలో ఏఎస్‌ఆర్ వారియర్స్‌పై జెఎం.నాయుడు టీమ్ విజయం సాధించింది. 6 బోయ్స్ టీమ్‌పై గంగవరం టీమ్ గెలుపొందింది. అలాగే 7 స్టార్స్ టీమ్‌పై అల్లూరి బి టీమ్ గెలుపొందింది. చంద్రపాలెం టీమ్‌పై పూడిమడక, కుంచంగి టీమ్‌పై వైజాగ్ వారియర్స్ గెలుపొందాయి. సోమవారం ఫైనల్స్, బహుమతి ప్రదానం జరుగుతుంది.



అల్లూరి, కర్నూల్ జిల్లా మహిళల కబడ్డీ పోటీల దృశ్యం

జాబ్ కేపిటల్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తామని, ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డును తరలిస్తామన్నారు. గతంలో అంతర్జాతీయ మ్యాచ్‌లకు అతిథ్యమిచ్చిన స్టేడియం నిరుపయోగంగా మారిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిని ఆధునికీకరించే బాధ్యతను తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఓపెన్ డ్రెయిన్లు ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్నాయని, భూగర్భ డ్రెయిన్లుగా మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీకి బలమే కార్యకర్తలు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని లోకేశ్ అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు అండగా ఉన్నారన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను కల్పిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రానున్న రెండు నెలలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, ఇంటింటికీ వెళ్లి 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించాలన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టేందుకు ఐదు రూపాయలు ఇస్తే పోస్టులు పెట్టే కొంతమంది యత్నిస్తున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని నారా లోకేశ్ సూచించారు. టీడీపీ, జనసేన కార్యకర్తల లక్ష్యం ఒక్కటేనని, 'హలో ఏపీ, బైబై వైసీపీ' అని లోకేశ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించిన అధికారులు, వైసీపీ నాయకులపై అధికారంలోకి వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తాను రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతుంటే వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని, దీనిపై కోర్టుకు వెళుతున్నారని పేర్కొన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తనను అరెస్టు చేయాలని లోకేశ్ అన్నారు.

ఐరన్ లెగ్ జగన్

... 5వ పేజీ తరువాయి

'శంఖారావం' సభలో ఆయన మాట్లాడారు. భస్మాసురుడు లాంటి జగన్‌ను విశాఖకు ఎంత దూరం పెడితే అంత మంచిదన్నారు. గతంలో ఎన్నడూ చూడనన్ని ప్రమాదాలను విశాఖ నాలుగున్నరేళ్లలో చూసిందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు విశాఖ వైపు ప్రపంచం చూసేలా అభివృద్ధి చేశారని, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాశనం చేశాడన్నారు. జగన్ అక్రమంగా కట్టిన భవనాలను జప్తు చేసి అమ్మి ప్రజలకు పంచి పెడతామని లోకేశ్ అన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో వైసీపీ నాయకులు ఓటుకు పది వేలు ఇస్తామంటారని, అడ్డంగా దోచుకున్న వైసీపీ నాయకులు నుంచి డబ్బులు తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటేయాలని లోకేశ్ సూచించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతామని, వసతి గృహాలను ఆధునికీకరిస్తామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు జగన్ సిద్ధపడుతున్నాడని, దీనికి కారణం ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కు కావడమే నిదర్శనమన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చేసిన అక్రమాలపై విచారణ జరిపించి డిస్మిస్ చేసి జైలులో పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. ప్రసాదరెడ్డి అక్రమాలన్నీ రెడ్‌బుక్‌లో ఉన్నాయన్నారు. టీడీఆర్ బాండ్లలో ఎంపీ విజయసాయిరెడ్డి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెదజాలరిపేట, బిలాల్ కాలనీ, మధురవాడల్లో టీడీఆర్ బాండ్ల పేరుతో వైసీపీ నాయకులు రూ.వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దసపల్లా భూములు కొట్టేశారని ఆరోపిస్తూ..వీటన్నింటిపై ప్రభుత్వం వచ్చిన తరువాత విచారణ జరిపి వడ్డీతో సహా కక్కిస్తామని పేర్కొన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ స్థానంలో కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు. జింక్ పరిశ్రమ ప్రాంతంలో కూడా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎన్ఏడీ పై ఓవర్, గోపాలపట్నంలో బీటీ, సీసీ రహదారులతోపాటు ఇండోర్ స్టేడియం నిర్మించామని లోకేశ్ వివరించారు.

అనకాపల్లి పేరుతో త్వరలో సినిమా తీస్తా

- సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న దర్శకుడు నక్కిన త్రినాథరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తన సొంత నిర్మాణ సంస్థ నక్కిన నరేటివ్స్ బ్యానర్‌పై అనకాపల్లి పేరుతో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు ప్రకటించారు. ఆదివారం ఆయన స్థానిక గౌరీ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటీ నటుల ఎంపిక, చిత్రీకరణ అనకాపల్లిలో జరుగుతుందన్నారు. తన సినీ జీవిత ప్రస్థానానికి బీజం పడింది గౌరీ గ్రంథాలయంలోనేనని ఆయన స్పష్టం చేశారు. సినిమాలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలోనే చదువుకున్నానని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షలు, వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు గ్రంథాలయంలో నిర్వహిస్తుండడంతో చాలా మందికి ఉపాధి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, దాడి ఈశ్వరరావు, బాలాజీ, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగుల సురేష్, పీలా జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యవర్గం నక్కిన త్రినాథరావును ఘనంగా సత్కరించింది.

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న జిల్లా ఎస్పీ



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ దంపతులు

నక్కపల్లి, ఫిబ్రవరి 18: మండలంలోని ఉపమాక క్షేత్రాన్ని ఆదివారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. నక్కపల్లి, అడ్డరోడ్డు సీఐలు ఎ.విజయ్‌కుమార్, అప్పన్న నేతృత్వంలో ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఎస్పీ మురళీకృష్ణకు ఘన స్వాగతం పలికారు. ఎస్పీ దంపతులు, కుటుంబసభ్యులు కొండపై వున్న స్వామి నిజరూపాన్ని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత గురించి అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు తెలియజేశారు. ఎస్పీ కుటుంబసభ్యుల గోత్రనామాలతో పూజలు చేశారు. తదుపరి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, తీర్థ ప్రసాదాలను బహూకరించి వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20న ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

- యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలు ఉద్యోగులకు ఇంకా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా పీఆర్‌సీ కమిటీని నియమించినప్పటికీ ఈ కమిటీ ఇంకా పనులు మొదలు పెట్టలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించనట్టయితే ఈనెల 28న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవో నాయకులు లక్ష్మీనారాయణ, నాగభూషణం, సురేష్, జగదీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిలాన్-2024

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిత్రదేశాలతో సంబంధాలు మెరుగుపరుచుకోవడానికి, సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోవడానికి రెండేళ్లకు ఒకసారి భారత నౌకాదళం నిర్వహిస్తున్న మిలాన్-2024 సోమవారం నుంచి విశాఖపట్నంలో ప్రారంభం కానుంది. ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతుంది. దీనికి 50 దేశాల నుంచి ప్రతినిధులు, 20కి పైగా యుద్ధనౌకలు, విమానాలు వస్తున్నాయి. మిలాన్ తొలి దశ(హార్బర్ పేజ్)లో భాగంగా అన్ని దేశాల నౌకా దళాలు కలసి ఆర్‌కే బీచ్‌లో ఇంటర్‌నేషనల్ సిటీ పెరేడ్ నిర్వహిస్తాయి. ఇంటర్నేషనల్ మేరీటైమ్ సదస్సు, మిలాన్ ప్రదర్శన ఉంటాయి. రెండో దశలో వివిధ దేశాల నేవీ దళాలు సముద్రంలో, గగనతలంలో విన్యాసాలు ప్రదర్శిస్తాయి. కార్యక్రమాలకు ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లను అతిథులుగా ఆహ్వానించారు. రక్షణ శాఖా మంత్రి కూడా హాజరవుతారు.



పాడేరు ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించండి

» జిల్లా ఆస్పత్రి వైద్యులకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశం

పాడేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వైద్యులకు సూచించారు. ఏజెన్సీలోని పలు ప్రాంతాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు స్థానిక ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో పీవో మాట్లాడి పలు సూచనలు చేశారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అందుకు అవసరమైన వార్డును సమకూర్చాలని సూచించారు. అలాగే ఎటువంటి పరిస్థితులైనా, అవసరమైనా తనకు సమాచారం అందించాలన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉంటే తనకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 18: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు అమ్మవారి మొక్కులు తీర్చుకొనేందుకు మైదాన ప్రాంతం నుంచి వచ్చి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి ప్రత్యేక పూజలను చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ప్రసాద కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, పోతురాజు, సిద్ధినాతి కొండలరావు, ఆర్‌కే.రాజు, టీవీఎస్.ముకుందరావు తదితరులు భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాల వద్దకు మైదాన ప్రాంత భక్తులు వందల సంఖ్యలో వచ్చి పండగ చేసుకున్నారు.

రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని ఆందోళన



సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించాలని నినాదాలు చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 18: తమ గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించాలని కరిముఖిపుట్టు పంచాయతీ గేదలబంద గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన బాట పట్టారు. సంఘం నాయకులు, గ్రామస్థులు మాట్లాడుతూ సీసీ రోడ్డు సౌకర్యం లేకపోడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డ్రైనేజీలు లేక మురుగునీరు ఇళ్లకు ఇరువైపులా పేరుకుపోతున్నదని వాపోయారు. దీంతో పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేవారు. ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు తమ గ్రామంలో సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీలు నిర్మించాలని వినతిపత్రం అందించామని, ఇది జరిగి మూడు నెలలు కావస్తున్నా పనులు జరగలేదని స్పష్టం చేశారు. సీసీ రోడ్డు, డ్రైనేజీతో పాటు గ్రామంలో ఇతర సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జి.నారాయణ, జి.జీనబంధు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు నమూనా ప్రతిభా పరీక్ష



నమూనా ప్రతిభా పరీక్షకు హాజరైన విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 18: మండలంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం నమూనా ప్రతిభా పరీక్షను నిర్వహించారు. పబ్లిక్ పరీక్ష రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలను ఎస్ఎఫ్ఐ నాయకులు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కార్తీక్ మాట్లాడుతూ ఎటువంటి తడబాటు లేకుండా పబ్లిక్ పరీక్ష రాసేందుకు నమూనా ప్రతిభా పరీక్ష ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. నేటి ఆధునిక యుగంలో ఉన్నత శిఖరాల అధిరోహణకు విద్య ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పరీక్షకు సుమారు 117 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పురుషోత్తం, అప్పారావు, వెంకట్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

వైసీపీకి యాదవ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజీనామా

» నేడు లోకేశ్ సమక్షంలో 500 అనుచరులతో కలిసి టీడీపీలో చేరనున్నట్టు శ్రీనివాస్ యాదవ్ వెల్లడి



గొలగాని శ్రీనివాస్ యాదవ్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 18: ఉమ్మడి విశాఖ జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడు, మల్లాం మాజీ సర్పంచ్ గొలగాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు పంపించినట్టు చెప్పారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలు కుదేలైపోయాయని, ముఖ్యంగా యువత, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పెరిగిన ధరలతో ప్రజలు విలవిలాడుతన్నారని, జగన్ అసమర్థత పాలనతో ఒక తరం నష్టపోయిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా ఒక్క చంద్రబాబునాయుడుకే వుందని అన్నారు. సోమవారం సాయంత్రం వడ్డాదిలో జరిగే లోకేశ్ శంఖారావం సభలో 500 మంది అనుచరులతో టీడీపీలో చేరనున్నట్టు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

తాగునీటి పథకం.. అలంకారప్రాయం!



గ్రామంలో చుక్క నీరు ఇవ్వని తాగునీటి ట్యాంకు ఇదే...

శ్రీకృష్ణపురంలో దాహం కేకలు

కలుషిత ఊట నీటితో రోగాల భయం

పట్టించుకోని అధికారులు, పాలకులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 12: మండలంలోని వంజరి పంచాయతీ శ్రీకృష్ణపురం గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇక్కడ నిర్మించిన సోలార్ నీటి పథకం అలంకారప్రాయంగా మారడం. పాత నీటి ట్యాంకు నిరుపయోగం కావడంతో గుక్కెడు నీటికి గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ గ్రామంలో 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో గ్రావిటీ ద్వారా తాగునీటి సదుపాయం కల్పించింది. అయితే ట్యాంక్‌లో మోటర్ మరమ్మతులకు గురికావడంతో ట్యాంక్‌కు నీరు సరఫరా కావడం లేదు. అంతేకాకుండా సోలార్ ద్వారా తాగునీటి అందించే లక్ష్యంతో నిర్మించిన పథకం కూడా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నది. ఈ రెండు నీటి పథకాలు చుక్క నీరు కూడా ఇవ్వకపోవడంతో గ్రామస్థులు తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు నిర్మించిన నీటి పథకం బోర్డు వరకే పరిమితమైందని మాజీ సర్పంచ్ టి.గంతన్నదొర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజుబాబుతో పాటు స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గత్యంతరం లేక గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న కొండ నుంచి పైపు సహాయంతో తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. గ్రామానికి వచ్చే తాత్కాలిక పైపుతో వచ్చే ఊటనీరు వర్షాకాలంలో బురదతో ఉంటున్నదని, ఈ కలుషిత నీటిని తాగడం వల్ల తరచూ రోగాల బారిన పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామంలో ఉన్న తాగునీటి పథకాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.



అలంకారప్రాయంగా మిగిలిన సోలార్ తాగునీటి పథకం

పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాలి

శ్రీకృష్ణపురంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు సదుపాయం కల్పించి రెండేళ్లు గడుస్తున్నది. అక్కడ నీటి పథకంపై పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

-విజయ్‌కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మేఘాల కొండ రహదారికి మరమ్మతులు

» అసంపూర్తిగా వదిలేసిన అధికారులు

» పంచాయతీ ప్రజలు, వాహన చోదకుల అగచాట్లు

» శ్రమదానానికి శ్రీకారం చుట్టిన ఆటో డ్రైవర్లు, గిరి యువకులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 18: ప్రముఖ పర్యాట కేంద్రం వంజంగి మేఘాల పర్వతానికి వెళ్లే మట్టి రహదారి మరమ్మతుకు ఆటో డ్రైవర్లు శ్రమదానంతో శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని మధ్యలో వదిలేసిన అధికారులు, పూర్తి చేసే విషయాన్ని మరచిపోయారు. దీంతో గత్యంతరం లేక ఆటో డ్రైవర్లు ముందుకు వచ్చారు.

మేఘాల పర్వతంపైకి వెళ్లేందుకు వై.జంక్షన్ బీటీ రోడ్డు నుంచి కల్లాబయలు గ్రామం వరకు మట్టి రోడ్డును వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దాన్ని అసంపూర్తిగా విడిచిపెట్టడంతో రోడ్డుకు అడ్డంగా బండ రాళ్లు ఉండిపోయాయి. ఫలితంగా ఆటోలను గ్రామాలను తీసుకువెళ్లేందుకు డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. చేసేది ఏమీ లేక తమ గ్రామానికి వెళ్లే రోడ్డును తామే శ్రమదానంతో బాగు చేసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లను కాల్చి వేడికి అవి బద్దలైన తరువాత పెకిలించి మట్టితో పూడ్చుకుంటున్నారు. కాగా, పర్యాటకుల ద్వారా మేఘాల పర్వతానికి వచ్చే ఆదాయాన్ని ఎకో టూరిజం ద్వారా పంచాయతీలకు కేటాయించే అధికారులు, రోడ్డును నిర్లక్ష్యంగా వదిలేయడంపై స్థానికులు, పర్యాటకులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చి స్థానిక ప్రజలకు, మేఘాల పర్వతాన్ని తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





కొండపైకి వెళ్లే మార్గంలో బండరాళ్లకు మంట పెట్టి రాళ్లను పగలగొడుతున్న యువకులు... మట్టి, బండరాళ్లను ఆటోలో నింపుతున్న డ్రైవర్లు

ఎట్టకేలకు గింజర్తి కొండవాగుపై వంతెన నిర్మాణం

కొయ్యూరు, ఫిబ్రవరి 18: మండలంలోని గింజర్తి సమీప కొండ వాగుపై ఎట్టకేలకు వంతెన నిర్మాణం తుది దశకు వచ్చింది. చోద్యం-చింతలపూడి ప్రధాన రహదారి మధ్యలో చింతలపూడి- గింజర్తి గ్రామాల మధ్య కొండవాగు ప్రవాహంపై ఈ వంతెన నిర్మించారు. కొండవాగుపై నిర్మించిన కాజ్‌వే మూడేళ్ల క్రితం ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఈ రహదారి ఆధారంగా రాకపోకలు సాగించే ఆరు పంచాయతీలకు చెందిన సుమారు 30 గ్రామాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి నుంచి కొండవాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, పాలకులకు వినతులు అందించారు. ఫలితంగా గత ఏడాది ఎంపీ నిధులతో పాటు రాష్ట్ర సబ్ ప్లాన్ నిధులు రూ.50 లక్షలతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ (ప్రాజెక్టు) విభాగం పర్యవేక్షణలో గత ఏడాది అక్టోబరులో వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం వంతెన పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే తమ రవాణా కష్టాలు తీరినట్టేనని ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న గింజర్తి సమీప కొండవాగుపై వంతెన

రూ.20 లక్షలతో చెరువుల సుందరీకరణ

» జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలో రూ.20 లక్షలు వెచ్చించి చెరువు సుందరీకరణ పనులను చేపడుతున్నామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చెప్పారు. ఈ మేరకు ఆదివారం చెరువు పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెరువు చుట్టూ రాతి పేర్పు, పలు రకాల మొక్కలు నాటడంతో పాటు మధ్యలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఏనుగురాయి పంచాయతీ సెల్లుమ్ గ్రామంలో వరహాలక్ష్మీనృసింహస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి కమిటీలను ఏర్పాటు చేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తెలిపారు. కమిటీల ఏర్పాటుకు సంబంధించి వివిధ పార్టీలు, పాత్రికేయులు, ప్రజా సంఘాలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణ రూ.60 లక్షలు మంజూరు చేశారని ఆమె తెలిపారు. ఈ నిధులు వెచ్చించి ఆలయ నిర్మాణం చేపడతామన్నారు. అలాగే వివిధ పార్టీలు, పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులతో కమిటీలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్.సుభాష్, వి.రమేష్, బాబూరావు, రత్న, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, వెలుగు ఏపీఎం దేవమంగ, వైసీపీ నాయకులు జేవీవీఎస్ మూర్తి, కొండలరావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

చురుగ్గా హైవే పనులు

... 5వ పేజీ తరువాయి

కావడం, అరకులోయ సమీపంలో పీవీటీజీ కాలనీకి ఆనుకొని ఉన్న స్థలాన్ని ఎన్‌హెచ్ఏఐకి అప్పగించడంలో జాప్యం, అరకు-యండపల్లివలస మధ్య కిలోమీటరు మేర ఫ్లైఓవర్ వంతెన నిర్మాణంలో భాగంగా రైల్వే ట్రాక్ వద్ద పిల్లర్ల ఏర్పాటుకు రైల్వే శాఖ నుంచి అనుమతుల్లో జాప్యం వంటి కారణాల వల్ల పనులు ఆలస్యం అయ్యాయని 5వ ప్యాకేజీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రాజెక్టు ఇన్‌చార్జి రమణయ్య తెలిపారు. దీంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు నిర్మాణ పనుల గడువును మరో ఆరు నెలలు పొడిగించారని వెల్లడించారు.



అరకులోయ-పానిరంగిణి మధ్య వంతెన అప్రోచ్ రోడ్ నిర్మాణం

చురుగ్గా వంతెనలు, అప్రోచ్ రోడ్ల పనులు

ప్రస్తుతం కొత్తబల్లుగుడ-గద్యగుడ మధ్య వంతెన నిర్మాణం, ఇరువైపులా అప్రోచ్ రోడ్ల పనులు జరుగుతున్నాయి. అరకులోయ-అరకు మధ్య పీవీటీజీ కాలనీ వెనుక వంతెన నిర్మాణంలో భాగంగా మట్టి పనులు చేస్తున్నారు. పానిరంగిణి-అరకులోయ మధ్య వంతెన పనులు పూర్తి చేసి, ఇరువైపులా అప్రోచ్ రోడ్ల పనులు చేపడుతున్నారు, అరకు-యండపల్లివలస మధ్య ఉన్న రైల్వే ఫ్లైఓవర్ వంతెన, కురిడి-నారింజవలస మధ్య వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా పిల్లర్లపై సీసీ గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు.మొత్తం 24 కిలోమీటర్ల పొడవున్న ఈ ప్యాకేజీలో ఇంతవరకు 18 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పనులు ఆరు నెలల్లో పూర్తి అవుతాయని ప్రాజెక్టు ఇన్‌చార్జి రమణయ్య వెల్లడించారు.

కాగా అనంతగిరి మండలం చిలకలగెడ్డ నుంచి బొడ్డవర, గంట్యాడ మండల కేంద్రం మీదుగా విజయనగరం వరకు 6వ ప్యాకేజీ కిందచేపట్టిన పనులు కూడా ముగింపు దశలో వున్నాయి. ఈ ఏడాది ఆగస్టు చివరినాటికి 5, 6 ప్యాకేజీల పనులు పూర్తవుతాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

అనకాపల్లి జిల్లాలో లోకేశ్ శంఖారావం

» నేడు, రేపు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభలు

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పేరుతో చేపట్టిన యాత్ర జిల్లాలో సోమవారం నుంచి రెండు రోజులు జరగనుంది. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న సభలను విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 19వ తేదీ సోమవారం అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో, 20వ తేదీన మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో జరిగే సభల్లో లోకేశ్ పాల్గొని ప్రసంగిస్తారు.

శంఖారావం సభల షెడ్యూల్

అనకాపల్లిలోని పూడిమడక రోడ్డు హైవే జంక్షన్ సమీపంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే శంఖారావం సభలో లోకేశ్ పాల్గొంటారు. సుమారు గంటపాటు ప్రసంగిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 6.30 గంటలకు చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలం వడ్డాది చేరుకుంటారు. ఇక్కడ శంఖారావం సభలో ప్రసంగించి రాత్రి ఎనిమిది గంటలకు బయలుదేరి మాడుగుల నియోజకవర్గం ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకుంటారు. రాత్రికి అక్కడ బస చేస్తారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మాడుగుల మండలం డి.సురవరం వద్ద శంఖారావం సభలో పాల్గొంటారు. 11.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి నర్సీపట్నం చేరుకుంటారు. భోజన విరామం అనంతరం 2.30 గంటలకు బలిఘట్టంలో జరిగే సభలో లోకేశ్ ప్రసంగిస్తారు. 3.45 గంటలకు ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల చేరుకుంటారు. 6.30 గంటల వరకు సభలో ప్రసంగిస్తారు.

☛ సంక్షిప్తంగా..

కాఫీ గింజలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తాం

» జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు

చింతపల్లి, ఫిబ్రవరి 18: గిరిజనులు విక్రయానికి సిద్ధం చేసిన కాఫీ గింజలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని జీసీసీ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు చెప్పారు. ప్రైవేటు వర్తకులు కాఫీ గింజలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ 'కాఫీ ధరలు పతనం' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కాఫీ చెర్రీని కిలో రూ.145 ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పది శాతం తేమ కలిగిన కాఫీ గింజలను సైతం జీసీసీ కొనుగోలు చేస్తున్నదన్నారు. రైతుల వద్దకు జీసీసీ ఉద్యోగులు వచ్చి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రైవేటు వర్తకుల మాటలను రైతులు నమ్మకూడదని సూచించారు. జీసీసీ కచ్చితమైన తూనిక యంత్రాలతో తరుగు లేకుండా గింజలను కొనుగోలు చేస్తున్నదన్నారు. అలాగే గింజలు విక్రయించిన మరుసటి రోజే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్టు డీఎం తెలిపారు.

ఐటీడీఏ ముట్టడికి తరలిరండి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 18: జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజల ఆరోగ్య రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్త (సీహెచ్‌డబ్ల్యూ)లను ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేపట్టే ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆశ కార్యకర్తలతో సమానంగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ డబ్ల్యూలకు వేతనం నెలకు రూ.10 వేలు చెల్లించాలని, ఆశలకు వర్తించే అన్ని రాయతీలను ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని వినతులు అందించినా, ఐటీడీఏ ముందు రిలే నిరాహార దీక్షలను చేపట్టినా ఫలితం లేకపోతున్నదని ఆయన వాపోయారు. ఈ నేపథ్యంలో పోరాటంతోనే డిమాండ్లను సాధించుకోవాలన్న లక్ష్యంతో సోమవారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి తలపెట్టామన్నారు. సీహెచ్‌డబ్ల్యూలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న హెచ్‌డబ్ల్యూవో

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 18: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని గిరిజన విద్యార్థులకు వసతి గృహ అధికారి రవికుమార్ సొంత నిధులతో స్టడీ మెటీరియల్‌ను ఆదివారం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాదిలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు హాజరయ్యే 221 మంది విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రెండేళ్లుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఇంటర్ విద్యాభ్యాసం అనంతరం భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఏ విధంగా వెళ్లాలనే అంశంపై సలహా, సూచనలు ఇస్తూ, వారికి ఆర్థికంగా ప్రోత్సాహన్ని అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఉద్యోగ నిర్వహణతో పాటు తోటి గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాని చక్కగా స్థిరపడాలన్నదే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.